రైతుల కడగండ్లు

- గత ఏడాది వరదలకు 100 చెరువులకు గండ్లు
- 62 గండ్ల పూడ్చివేతకు ప్రతిపాదనలు
- బయటకు వెళ్లిపోతున్న వర్షం నీరు
- గండ్లు పూడ్చాలని రైతుల వినతి


బత్తులవారిగూడెంలో పూడ్చకుండా అలాగే ఉన్న అప్పారావు చెరువు గండి

నూజివీడు: గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని వంద చెరువులకు గండ్లు పడ్డాయి. 13 నెలలు గడిచినా ఇంతవరకు వాటిని పూడ్చలేదు. గండ్లు పూడ్చకపోవడంతో చెరువుల్లోకి వచ్చిన వర్షం నీరంతా బయటకు వెళ్లిపోతోంది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఉపయోగం ఏమీ లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి పెద్ద ఎత్తున వచ్చిన వరదకు నూజివీడు నియోజకవర్గంలోని చెరువులన్నింటికి గండ్లు పడ్డాయి. క్లౌడ్ బరస్ట్ అన్న చందంగా మూడు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి నియోజకవర్గంలోని నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో కలిపి సుమారు వంద చెరువులకు గండ్లు పడ్డాయి.

పొలాలు, పల్లపు ప్రాంతాలు జలమయం

పట్టణంలోని పెద్ద చెరువుకు అయితే నాలుగు చోట్ల గండ్లు పడి వరద నీరంతా బయటకు వెళ్లిపోయింది. దీంతో గండ్లు పడిన చెరువుల ఆయకట్టు పొలాలతో పాటు సమీపంలోని పల్లపు ప్రాంతాలు సైతం ముంపునకు గురయ్యాయి. పడిన గండ్లను పూడ్చటం, బలహీనంగా ఉన్న కట్టలను బలోపేతం చేయడం వంటి పనులను చేపట్టాల్సిన ప్రభుత్వం ఇంత వరకు వాటిపై దృష్టి సారించలేదు.

13 నెలలు గడిచినా నిధులేవి?

నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులకు పడిన గండ్లను ప్రభుత్వం పూడ్చకుండా గాలికి వదిలి వేసింది. 13 నెలలు గడుస్తున్నా ఇంతవరకు గండ్లు పూడ్చేందుకు ఒక్క పైసా నిధులను కూడా మంజూరు చేయలేదు. ఆయా చెరువుల సాగునీటి సంఘాల ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులను అడుగుతుంటే ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన తరువాత గండ్లు పూడ్చివేత పనులు చేపడతామంటూ చెప్పిందే చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకుండా వదిలి వేయడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని వర్షాలు కురిసినా వచ్చిన నీరు వచ్చినట్లు గండ్ల ద్వారా బయటకు వెళ్లిపోతుండటంతో చూడలేక కొన్ని చోట్ల రైతులే కొద్దికొద్దిగా ఇసుక బస్తాలు అడ్డు వేసి చెరువుల్లో నీటిని ఆపుకుంటున్నారు.

చెరువులు నిండితేనే సాగు

నూజివీడు నియోజకవర్గంలో వ్యవసాయం ముఖ్యంగా చెరువుల ఆధారంగానే జరుగుతుంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో కూడా చెరువులు నిండితేనే వ్యవసాయ పనులు సాగుతాయి. అంతేగాకుండా చెరువుల్లో నీరు ఉంటేనే వ్యవసాయ బోర్లలో గానీ, గ్రామంలోని బావుల్లో గానీ భూగర్భ జలాలు పడిపోకుండా ఉంటాయి. ఇరిగేషన్ అధికారులు మాత్రం 62 చెరువుల గండ్లు పూడ్చటానికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలు ఎప్పటికి కార్యరూపం దాల్చుతాయో అని, పనులు ఎప్పుడు చేపడతారో అని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఏడాదైనా గండి పూడ్చలేదు



గ్రామంలోని అప్పారావు చెరువుకు గత ఏడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి గండి పడింది. ఇంతవరకు గండిని పూడ్చకుండా అలాగే వదిలేశారు. ఈ చెరువు కింద 200 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఎన్నెస్పీ జలాలు వస్తుండటంతో వరి సాగు చేశారు. లేకపోతే ఆయకట్టు మొత్తం బీడుభూమిగా మారేది. ఈ చెరువుకు పడిన గండిని వెంటనే పూడ్చాలి.

– మందాడ స్వామి, బత్తులవారిగూడెం, నూజివీడు మండలం

ప్రతిపాదనలు పంపించాం

నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులకు వంద గండ్లు పడగా వాటిలో 62 గండ్లు పూడ్చేందుకు గానూ రూ.21.29 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. ఈ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే గండ్ల పూడ్చివేత పనులు చేపడతాం.

– అర్జునరావు, ఇరిగేషన్ డీఈ, నూజివీడు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



నూజివీడు: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సబ్ కలెక్టర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలో అధిక సంఖ్యలో ప్రజలు ఉండటంతో ఇంతమంది ఎందుకు ఉన్నారు అని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారని సిబ్బంది తెలుపగా ఒకేసారి ఇంతమంది లోపలికి రాకుండా చూడాలన్నారు. తదుపరి రిజిస్ట్రేషన్లు చేస్తున్న వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కరాటేలో చిన్నారి ప్రతిభ

తిరువూరు: స్థానిక నాగార్జున స్కూల్ విద్యార్థిని కొంగల జెస్సీ కరాటేలో ప్రతిభ చూపిందని ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు తెలిపారు. రేవంత్ డిఫెన్స్ స్కూల్‌లో కరాటేలో శిక్షణ పొందిన జెస్సీ ఇటీవల చెన్నైలో ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ నుంచి ప్రశంసాపత్రం, మెడల్ సాధించిందన్నారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన కోచ్ రేవంత్‌ను నాగార్జున స్కూల్ ఉపాధ్యాయులు, యాజమాన్యం అభినందించారు.

క్లుప్తంగా

మాస్టర్ ప్లాన్ తయారీపై రేపు సమావేశం

నూజివీడు: నూజివీడు మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను ప్రభుత్వం ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించిన నేపథ్యంలో ఈనెల 10న ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో బృహత్తర ప్రణాళికపై సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, కౌన్సిలర్లతో పాటు పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నిర్మాణ రంగ ప్రతినిధులు, విద్యారంగ ప్రతినిధులు పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ



మైలవరం: చిలుకూరువారిగూడెం అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అన్నాబత్తుల సుధాకర్ పాఠశాలకు రూ.25 వేల విలువ చేసే ఇన్వర్టర్‌ను బుధవారం ప్రధానోపాధ్యాయిని అన్నే కుసుమకుమారికి అందజేశారు. ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ దాతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

మైలవరం: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసే రైతులకు ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని న్యూఢిల్లీ నుంచి వచ్చిన పీహెచ్‌డీ స్కాలర్ బృంద జి.కృష్ణన్ అన్నారు. మైలవరం, జి.కొండూరు మండలాల్లోని వ్యవసాయ క్షేత్రాలను బుధవారం సందర్శించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయం అమలు తీరు, పురోగతిని క్లుప్తంగా వివరించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై. శంకర్ నాయక్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి ఉపయోగాలను తెలిపారు. వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటనలో నిర్లక్ష్యం తగదు: ఎస్టీయూ

జి.కొండూరు: ప్రభుత్వం ఏర్పడి పదహారు నెలలు గడిచినా ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. యూనియన్ నాయకులు శ్యామ్, అనంత్, శాంత్‌రాజు, కోట శ్యామ్ ప్రసాద్, ఆనంద్‌బాబు, మోహన్‌రెడ్డి, జోసఫ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

జీకొత్తూరు(తిరువూరు): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం కలిగిన పదార్థాలను తీసుకోవాలని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి పేర్కొన్నారు. రాష్ట్రీయ పోషణ మహోత్సవంలో భాగంగా మండలంలోని జీకొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన సమావేశం నిర్వహించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు, చిరుధాన్యాల్లో ఎక్కువ పోషకాలుంటాయని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ఆగిరిపల్లి: సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ బి.భార్గవి పేర్కొన్నారు. అడవినెక్కలం సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, తాగునీరు, భోజనం, మరుగుదొడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ బాలికల ఆటల పోటీలు


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కిశోర్‌కుమార్ తదితరులు

నూజివీడు: పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నూజివీడు మండల స్థాయి బాలికల ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం రెవరెండ్ బ్రదర్ కిశోర్ కుమార్, బ్రదర్ జార్జిరెడ్డి, సుజన్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డొక్కు శ్రీనివాసరావు మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపి ఎంపికైన వారు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కబడ్డీ, షటిల్, ఖోఖో, వాలీబాల్, యోగా, చదరంగం పోటీలను నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ..

తిరువూరు: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో తిరువూరు అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ 19 విభాగంలో ఇంటర్ విద్యార్థులు ఎల్. సిద్దు జిల్లా స్థాయిలో లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, డీ టైటాన్స్ నిరీక్షణ్ షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం సాధించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్‌లో తమ విద్యార్థులు జిల్లా జట్టులో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రవిబాబు తెలిపారు.

కలుషిత తాగునీటి సరఫరాపై నిరసన


నిరసన వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శించారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద తాగునీటి కాలుష్యంపై బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పైపులైన్లు తుప్పు పట్టడం, మురుగు కాలువలో నీరు తాగునీటిలో కలవడం, ఆ నీటిని ప్రజలకు సరఫరా చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటిని తాగిన ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రస్తుతం ప్రజలు వైరల్ జ్వరాల బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. కృష్ణా నది ఒడ్డున ఉన్న గ్రామాలకు తాగునీరు అందించలేని కూటమి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. సీపీఎం నాయకులు బాష, ఆలేటి విఠల్ రావు, వీటీపీఎస్ సీఐటీయూ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలి


ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తాహేరా సుల్తానా

ఆగిరిపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు తాహేరా సుల్తానా పేర్కొన్నారు. నూతనంగా నియమించిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం తోటపల్లి హీల్ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి ఎదుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డీఈఓ ఎం. వెంకట లక్ష్మమ్మ, రాష్ట్ర పాఠశాల విద్య పరిశోధన శిక్షణ మండలి అధికారి శ్రీమన్నారాయణ, ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారి రావి అరుణ, ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మండ్రం వాగుపై అక్రమార్కుల కన్ను

వ్యర్థాలతో నింపుతున్న వైనం


కట్టుబడిపాలెం గ్రామాన్ని ఆనుకుని తొమ్మండ్రం వాగులో వేస్తున్న భవనాల వ్యర్థాలు

జి.కొండూరు: జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు సరిహద్దుగా కట్టుబడిపాలెం వద్ద ఉన్న తొమ్మండ్రం వాగు కనుమరుగవుతోంది. గడ్డమణుగు లోయలోని కొండల్లో సహజ సిద్ధంగా పుట్టిన ఈ వాగు కట్టుబడిపాలెం గ్రామం మీదుగా కవులూరు వరకు ప్రవహించి బుడమేరులో కలుస్తోంది. అయితే ఇటు కట్టుబడిపాలెం, అటు కొండపల్లి పారిశ్రామికవాడకు సరిహద్దు ప్రాంతంలో ఒక వైపు వాగు, మరో వైపు ఏపీఐఐసీకి కేటాయించిన స్థలం పదకొండు ఎకరాలకు పైగా ఉంది. ఇప్పుడు అక్రమార్కులకు ఈ స్థలంపై కన్నుపడింది. పాత భవనాలను తొలగించగా వచ్చిన వ్యర్థాలను ఈ వాగులో నింపుతూ మెరక చేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ వాగు వద్ద 30వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని కొన్ని దుకాణాలను ఏర్పాటు చేయగా వాటికి వెనుక భాగంలోనే ఈ శిథిలాలను నింపుతూ అక్రమార్కులు వాగును పూడ్చే పనిలో పడ్డారు. ఇదేవిధంగా ఆక్రమణలు కొనసాగితే తొమ్మండ్రం వాగు కనుమరుగై పోయి భారీ వర్షాలు పడినప్పుడు కొండల్లో నుంచి వచ్చే వరద ఉధృతితో అటు కొండపల్లి ఐడీఏలోని పరిశ్రమలతో పాటు కట్టుబడిపాలెం గ్రామం, కొండపల్లి శాంతి నగర్ వంటి గ్రామాలు పూర్తిగా నీట మునిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ వాగు ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



నూజివీడు: మండల స్థాయిలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో శ్రీ శారద స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్–14 విభాగంలో సాయిఅఖిల్ (కబడ్డీ), ఎ.రామ్‌కిరణ్ (ఖోఖో), అభిలాష్ (చెస్), యూనిత్య(ఖోఖో), ఎ.శ్రీనిత్య (ఖోఖో), టి.మేఘన (షాట్‌పుట్) ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో ఒ.హిమ ఐశ్వర్య (ఖోఖో), గుణ హర్షిత (చెస్) ఎంపికయ్యారు. విద్యార్థులను శ్రీ శారద విద్యా సంస్థల చైర్మన్ కుప్పాల శంకరరావు అభినందించారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ ఎస్ఐ వీరాంజనేయులు



తిరువూరు: నేటి తరం విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మత్తుపదార్థాల నిరోధక ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ ఎస్ఐ ఎం. వీరాంజనేయులు అన్నారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం నైతిక విలువలు, మత్తు పదార్థాల నిరోధం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆకర్షితులై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వారికి విలువలతో కూడిన విద్య నందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులను తరగతి గదిలో నిరంతరం పరిశీలించే ఉపాధ్యాయులు వారిలో వచ్చే మార్పులను గమనించి తప్పుడు మార్గంలోకి వెళ్లకుండా దిశానిర్దేశం చేయగలిగే విధంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూడా ఉపాధ్యాయులే మార్గదర్శకులన్నారు. ఈగల్ టీమ్ అధికారి పి. రాంబాబు, శిక్షణ తరగతుల సమన్వయకర్తలు కేశవరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

రెండు రేషన్ షాపులు సీజ్

జి.కొండూరు: మండలంలోని వెల్లటూరులో రెండు రేషన్ షాపులను విజిలెన్స్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. గ్రామంలోని 26, 27, 28 నంబర్ల రేషన్ షాపులను విజిలెన్స్ సీఐ ఎండీ ఉమర్ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. 27వ నంబరు షాపులో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం, 28వ నంబరు షాపులో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్టాకు తక్కువగా ఉండడంతో బియ్యం పక్కదారి పట్టినట్లు నిర్ధారణకు వచ్చి రెండు షాపులను సీజ్ చేశారు. డీలర్లపై కేసులు నమోదు చేయాలని ఆర్ఐ మనీందర్‌సింగ్‌ను ఆదేశించారు.

రెస్టారెంట్‌లో తనిఖీలు

జి.కొండూరు దర్బార్ రెస్టారెంట్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వినియోగించకుండా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న క్రమంలో రెస్టారెంట్‌లో ఉన్న పది డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని రెస్టారెంట్ నిర్వాహకులపై కేసు నమోదుకు ఆదేశించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన: ఎంఈఓ




చాట్రాయి: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ–1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు. చాట్రాయి ఆర్‌సీఎం యూపీ స్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం



మైలవరం: సమాజానికి సేవ చేయడమే లయనిజం ధ్యేయమని లయన్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో బుధవారం సేవా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పాస్ట్ జిల్లా గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. నూతనంగా ఇద్దరు లయన్స్ క్లబ్ సభ్యత్వం తీసుకున్నారు. చైల్డ్ ఐ కేర్ క్యాంపు జిల్లా కో–ఆర్డినేటర్ వై. శ్రీనివాసరావు ఉచితంగా 250 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ ఎన్‌వీఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నూజివీడు: నూజివీడు–గంపలగూడెం ఆర్అండ్‌బీ రోడ్డుపై పట్టణంలోని గొడుగువారిగూడెం సమీపంలోని శ్మశానం చెరువు వద్ద భారీ గుంత పడింది. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచి వాహనాన్ని నడిపినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇక్కడ రోడ్డు కింద భాగంలో ఉన్న సిమెంట్ తూర పగిలిపోవడంతో రోడ్డు పై నుంచి కిందకు భారీ గుంత పడింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎలాంటి ప్రమాదం సంభవించకముందే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవార్డులు సాధించిన మెప్మా సభ్యులకు సన్మానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో మెప్మా విభాగానికి చెందిన శ్రీరామ స్లమ్ లెవల్ ఫెడరేషన్ సభ్యురాలు లక్ష్మీ, టెర్రస్ గార్డెనింగ్ (పెరటి తోటల పెంపకం)లో ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు విజయలక్ష్మికి స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర విభాగంలో జిల్లా స్థాయి అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కౌన్సిలర్లు అవార్డులు పొందిన ఇద్దరిని సత్కరించారు. కొండపల్లి బొమ్మలు అందజేసి అభినందించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

• **తెగుళ్ల నివారణకు సూచనలు**

చాట్రాయి: వరి పంటకు ఆశించిన తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన ఉండాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చాట్రాయిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరికి ఆకుమచ్చ, పొడ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మరియు టెట్రా సైక్లిన్, కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి 10 రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు.